
ప్రజాశక్తి
బుధవారం 28 మే 2025
5
పార్వతీపురం మన్యం



నేడు ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలు

పార్వతీపురం: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంత్సోవాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్టీయార్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండగగా పరిగణించిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలకరణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ జీవిత విశేషాలను తెలియజేస్తూ ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. ఎన్టీఆర్ రాష్ట్రానికి చేసిన సేవలపై పలువురు వక్తలు సందేశాలు, నాటక ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ పత్రాలివ్వకపోతే అన్నదాత సుఖీభవ రానట్టే

- ఒక కుటుంబంలో ఒకరికే సాయం
- జూన్‌లో డబ్బులు పంపిణీకి ఏర్పాట్లు
- జోరుగా రైతుల వివరాలు పరిశీలన
- రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సిందే: డిఎఒ రాబర్ట్ పాల్



ప్రజాశక్తి - పార్వతీపురం

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత త్వరలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ హామీలలో అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం. ఈ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన రైతు భరోసాకు బదులుగా అన్నదాత సుఖీభవ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం అమలుకు సిద్ధమవుతోంది. రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులకు పెట్టుబడి సాయంగా నగదు బదిలీ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ యోజన పథకం కింద అందజేస్తున్న రూ.6వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు మొత్తం రూ.20 వేలు మూడు విడతల్లో పంపిణీ చేయనుంది. ఈ పెట్టుబడి సాయం పొందాలంటే రైతులు విధిగా ఆధార్ నెంబర్, భూములకు సంబంధించిన వన్ బీ పత్రాలు సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. చాలామంది భూములు కలిగిన రైతులు దూర ప్రాంతాల్లో నివాసం వుంటున్నారు. భూములున్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్, వన్ బీ పత్రాలు అందజేయాల్సి వుంది. ఈ విధంగా భూములు న్న గ్రామాల్లో లేని రైతులు జిల్లా వ్యాప్తంగా 22వేల మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరంతా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పత్రాలు సమర్పించకపోతే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం మంజూరయ్యే అవకాశం లేదు.

జోరుగా రైతుల వివరాల పరిశీలన

అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన వారిని ఎంపిక చేయడానికి గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు పరిశీలన చేపడుతున్నారు. భూములున్న గ్రామాల్లో రైతులు కనిపించకపోవడంతో లేరని భావిస్తున్నారు. రైతుకు సంబంధించిన భూమి పత్రం వన్ బీ, గుర్తింపు పత్రం, ఆధార్ కార్డులను స్థానిక రైతు సేవా కేంద్రాలకు అందజేయాల్సి ఉంది. ఈ పత్రాలు ఇవ్వని వారిని అనర్హులుగా పరిగణించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ విధంగా 22వేల మంది రైతులు ఎక్కడెక్కడో ఉన్నారు. భూములున్న గ్రామాల్లో వారు లేకపోవడంతో కనిపించడం లేదని భావిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ఇంతవరకు అన్నదాత సుఖీభవ కు అర్హులైన వారు లక్షా 50వేల మంది. స్థానికంగా లేని రైతులు కూడా ఆయా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పత్రాలు సమర్పిస్తే లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

జూన్‌లో పెట్టుబడి సాయం పంపిణీకి ఏర్పాట్లు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న జూన్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద నగదు బదిలీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే రెండు వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే మొదటి విడత సాయం ఐదువేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వ్యవసాయ పనులకు పెట్టుబడి సాయం కింద నగదు పంపిణీ చేయనున్నారు.

ఒక కుటుంబంలో ఒకరికే సాయం

ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు రైతులు ఉన్న ఒకరికి మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించనున్నారు. ఒక్కో కుటుంబంలో తల్లి దండ్రులతో పాటు పిల్లల పేరిట కూడా భూములు వుండే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ కుటుంబానికి పెట్టుబడి సాయం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో ఒక ఇంట్లో ఎంతమంది రైతులు వున్నా రైతు భరోసా కింద నగదు బదిలీ జరిగింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం కుటుంబంలో ఒకరికి మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసే పనిలో నిమగ్నమైంది. ఈ మేరకు అధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సిందే

ఏ గ్రామంలో భూమి ఉందో ఆ గ్రామ రైతు సేవా కేంద్రానికి విధిగా రైతులు వెళ్లి వన్ బీ, ఆధార్ పత్రాలు అందజేయాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతుల పరిశీలన జరుగుతోంది. భూమి ఒకచోట, రైతు మరోచోట నివాసం ఉంటే తప్పనిసరిగా భూమి ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలి. ఆధార్, వన్ బీ పత్రాలు సమర్పించాలి. లేకపోతే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం మంజూరు కాదు.

కె. రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

జిల్లాకు భారీ వర్ష సూచన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉత్తరాంధ్రలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు భారీ వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. 30 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచి అక్కడక్కడ భారీ వర్షాలతో పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృత వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణం మంగళవారం జిల్లా వ్యాప్తంగా చెదురుమదరుగా జల్లులు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ డివిజన్ పరిధిలోని మండలాల్లో ఎక్కువగా వర్షపాతం నమోదు కాగా, పార్వతీపురం డివిజన్లో వర్షాలు తక్కువగా కురిసినట్లు మంగళవారం జిల్లా అధికారులు విడుదల చేసిన గణాంకాలు తెలియజేస్తున్నాయి.

వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 49 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, జిల్లా సగటు 3.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా సీతంపేటలో 15.4, భామిని 7.2, పాలకొండ 8.6, కొమరాడ 2.2, గుమ్మలక్ష్మీపురం 4.8, కురుపాం 2.6, జిఎంవలస 3.6, పార్వతీపురం 4.8, వర్షపాతం నమోదైంది. రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో విస్తృతంగా వర్షాలు ఉంటాయని, అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు పొలాలకు వెళ్లేవారు రైతులు ఉపాధి వేతనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

29 నుంచి రైతు వద్దకే కెవికె శాస్త్రవేత్తల బృందం

ప్రజాశక్తి - కురుపాం

మే 29 నుంచి జూన్ 12 వరకు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల బృందం మన్యం జిల్లాలో గల 15 మండలాల్లోని రైతుల వద్దకు వెళ్లి ఖరీఫ్ సీజన్ ముందస్తు ప్రణాళికలు గూర్చి అవగాహన కల్పించనున్నట్టు కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ తెలిపారు. మంగళవారం స్థానిక కెవికెలో ఆయన మాట్లాడుతూ విక్షి సంకల్పయాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో వ్యవసాయం, ఇతర రంగాలపై చర్చ, గ్రామాల్లో ఇఫ్కో వారి సహకారంతో డ్రోన్స్ స్ప్రేయింగ్ ప్రదర్శన, వివిధ పంటల్లో కొత్త రకాలు వంగడాలు, సాంకేతికతపై చర్చ జరుగుతుందని తెలిపారు. అలాగే వ్యవసాయంతో పాటు ఇతర రంగాలైన పశు సంపద, విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం అంశాలపై చర్చ, సందర్శనలు, వివిధ పంటలను సందర్శించి చీడ పేడలను ఇతర సమస్యలను నివారణ మార్గాలను సూచిస్తామన్నారు. కొత్త సమస్యలకు పరిశోధన చేయడానికి కార్యాచరణ రూపొందిస్తామని కావున ఈ కార్యక్రమాల్లో రైతులంతా పాల్గొనాలని కోరారు.

డిఎ జుగా విజయవంతం చేయాలి : కలెక్టర్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జెజియుఎ) అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలను త్రికరణ శుద్ధితో అమలుకు కృషి చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గ్రామ, స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించేందుకు ఉద్దేశించిందని తెలిపారు. ఈ పథకంలో భాగంగా వివిధ ధ్రువపత్రాలు అందిస్తామని ఆ పేర్కొన్నారు. పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించి ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో కార్యకలాపాలు చేపట్టడం జరుగుతుం దన్నారు. ఆధార్, ఇ - కెవైసి డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయన్నారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల పోషక విలువలు తెలియజేసేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాడైన గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయరాదని ఆయన ఆదేశించారు. రక్త హీనత లేకుండా దృష్టి సారించాలని, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి ఆసుపత్రిలో చేర్పించాలని చెప్పారు. పుట్టిన బిడ్డకు పాలు పట్టే విధానం తెలియకపోవడం వల్ల కొన్ని శిశు మరణాలు జరుగుతున్నాయని, పాలు పట్టే విధానం పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గిరి చైతన్యం డిజిటల్ మీడియా వాహనం ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఎన్ఆర్ సి కేంద్రాలకు ప్రతిపాదనలు సమర్పించాలి

పౌష్టికాహారం అందించే పునరావాస కేంద్రాలకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కేంద్రం అవసరాలను గుర్తించి పక్కాగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయనున్న పాల పిండి ప్యాకెట్లు విడుదల చేశారు. బాల్య వివాహాల నివారణ, తదితర అంశాలపై తయారు చేసిన పోస్టర్ లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి కనకదుర్గ, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకొనుడే



- ప్రభుత్వ నిబంధనలకు పాతర
- యథేచ్ఛగా ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రభుత్వ విధానాల ఫలితంగా విద్యను వ్యాపారంగా మార్చుకున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు.. తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. 2025 -26 విద్యా సంవత్సరాన్ని విద్యా వ్యాపార సంవత్సరంగా మార్చేశాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, అధిక మొత్తంలో అడ్డూఅదుపూ లేని ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకు తింటున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలో కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు 500పైగా ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్ల పేరుతో ఇంటింటా ప్రచారం చేస్తూ తమ కళాశాలలు, పాఠశాలల్లో చేర్పించాలంటూ ఊదరగొడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను హేళన చేస్తూ తమ పాఠశాలలోనే అత్యాధునిక విద్య అందుతుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయి. అందినంత దోచుకునే ప్రయత్నాల్లో తమ పాఠశాలలో విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులను బృందాలుగా ఏర్పాటు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు వల వేస్తున్నాయి.

నిబంధనలకు తిలోదకాలు

ప్రతి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థ కూడా ముందు తాము వసూలు చేసే ఫీజుల వివరాలు, రవాణా ఛార్జీలు డిస్‌ప్లే బోర్డులో పెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏ ప్రయివేటు విద్యా సంస్థ ముందు ఇలాంటి బోర్డులేవీ కనిపించవు. నిబంధనల మేరకు ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపులు ఉండవు. ఏ విద్యాసంస్థ యాజమాన్యం కూడా తమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు నెలకు రూ.15 వేలకు మించి జీతాలు ఇవ్వడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రూ.వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలు తమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రం తక్కువ జీతాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయి.

యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు

ప్రతి విద్యా సంవత్సరం స్టేషనరీ పేరుతో కార్పొరేట్ ప్రయివేటు విద్యాసంస్థలు లక్షలాది రూపాయలు దండుకుంటున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎలాంటి నోటుపుస్తకాలు, అచ్చు పుస్తకాలు విక్రయించరాదనే నిబంధనలు ఉన్నా ఎక్కడా పాటించడం లేదు. ఇష్టానుసారం పుస్తకాలు, యూనిఫాం, ఇతర స్టేషనరీ పేరుతో దోచుకుంటున్న ఈ విద్యాసంస్థలను ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. కట్టడి చేయాల్సిన ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో వీరి దోపిడీకి విద్యార్థుల తల్లిదండ్రులు బలైపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ నుంచి రక్షించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



రెవెన్యూ కార్యాలయ అధికారికి వినతిని అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలోని గిరిజనులకు నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ 3ను తక్షణమే ప్రభుత్వం పునరుద్ధరించి ఆదివాసీలకు స్పెషల్ డిఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3ను రద్దు చేయడంతో గిరిజనులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నారు. ఇందు వల్లే ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సిలోనూ కూడా తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఐటిడిఎ పరిధిలో 42 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఆదివాసీలకు దక్కిందన్నారు. జిఒ 3 షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి స్పెషల్ డిఎస్‌సి నిర్వహిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోగిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, జిల్లా నాయకులు ఎం.సన్యాసిరావు, పువ్వల మోహన్‌రావు ఉన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల కేసులో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో గల టిడ్కో ఇళ్ల కోసం ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి పలువురిని మోసం చేసిన కేసులో మహిళను అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ మురళీధర్ తెలిపారు. మంగళవారం టౌన్ పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన బచ్చల పద్మాంబిక పలువురికి ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు ఇస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి నకిలీ ఇళ్ల పట్టాలు అందజేశారు. దీంతో బాధిత వ్యక్తి కె.సురేష్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో కేసును నమోదు చేసి ఎస్ఐ జగదీష్ నాయుడు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

బదిలీల్లో ఎస్‌జిటి సీనియర్లకు న్యాయం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే బదిలీల్లో ఎస్‌జిటి సీనియర్లకు, డిఎస్‌సి 2001 వారికి న్యాయం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్‌జిటి సీనియర్ జాబితాలో డిఎస్‌సి 2001 వారి కంటే ముందు డిఎస్‌సి-2002 ఉపాధ్యాయులు 2023లో బదిలీల్లో 8 ఏళ్లు పూర్తికాకుండా ఏడున్నరేళ్లకు తప్పనిసరిగా బదిలీ చేసి అప్పటి ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యారని తెలిపారు. 2023 బదిలీల్లో రేషన్లైజేషన్‌కు గురైన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్లతో పాటు రీఅపోర్షన్ పాయింట్లు 5 ఇచ్చారన్నారు. కానీ 2025 బదిలీల్లో రేషన్లైజేషన్‌కు గురైన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్స్ 24 డిఫాల్ట్‌గా వచ్చాయని, రీఅపోర్షన్ పాయింట్లు 5 రాలేదన్నారు. ప్రస్తుతం 8 అకాడమిక్ సంవత్సరాలు పూర్తయి తప్పనిసరి బదిలీ అవుతున్న ఉపాధ్యాయులకు స్టేషన్ పాయింట్లు 23.4304 వచ్చాయన్నారు. ఈ బదిలీల్లో రేషన్లైజేషన్ అయిన వారికి అప్పట్లో ఏడున్నరేళ్లకు ఓల్డ్ స్టేషన్ పాయింట్స్ 22.7460 ఇచ్చి బలవంతంగా బదిలీ చేశారన్నారు. 2025లో 8 అకాడమిక్ సంవత్సరాలు నిండిన తప్పనిసరిగా బదిలీ అవుతున్న వారు స్టేషన్ పాయింట్స్ 24 ఇవ్వనందున ఇప్పుడు పై అధికారుల నుంచి ఎటువంటి క్లారిఫికేషన్ రాకపోయినా రేషన్నైజేషన్ అయిన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్స్ 22.7460 డిఇఒ కార్యాలయం వారు మార్పు చేస్తున్నారన్నారు. ఇలా స్టేషన్ పాయింట్స్ తగ్గిస్తే డిఎస్‌సి 2001, సీనియారిటీ లిస్టులో ఉన్న డిఎస్‌సి 2002 వారి కంటే వెనకబడి మరోసారి అన్యాయానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున 2025 బదిలీల్లో రేషన్లైజేషన్ అయిన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్స్ 24తో పాటు రీఅపోర్షన్ పాయింట్స్ 5 వచ్చేలా ఉన్నతాధికారులు తగు నిర్ణయం తీసుకొని రెక్టిపై చేయించి సీనియర్లకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

పాడైన చికెన్ స్వాధీనం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పెద్ద బజారులోని పలు ప్రాంతాల్లో దుకాణాలను శానిటరీ ఇన్ స్పెక్టర్,బాలకష్ణ. ప్రజారోగ్య సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చేపలు, చికెన్ దుకాణాలను, వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 కేజీల పాడైన కోడి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే నాలుగు కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోన్నారు. పరిశుభ్రత పాటించని విక్రయదారులకు రూ.6వేలు అపరాధ రుసుం విధించామని, తూనికల్లో తేడాను గమనించి సంబంధిత శాఖ వారికి రాత పూర్వకంగా తెలియజేస్తామని, వారిని హెచ్చరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఈ వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి, మీరు చేస్తున్న వ్యాపార పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ కవర్లను వాడరాదని, ఆరుబయట చెత్తలు వేయరాదని, కొలతల్లో తేడాలు చేసి ప్రజలను మోసం చేయరాదని, కుళ్లి, పాడైన మాంసాన్ని అమ్మరాదని హెచ్చరించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నమోదుకండి... యోగాకు రండి

ప్రజాశక్తి - పార్వతీపురం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామ స్థాయిలో కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక మంగళ వారం సాయంత్రం జిల్లా, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహణలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఇప్పటి వరకు 216 మాస్టర్ ట్రైనర్‌ల శిక్షణ జరిగిందని, 3550 శిక్షకులు నమోదు చేసుకుని శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షకులను గ్రామ స్థాయిలో మ్యాపింగ్ చేయాలన్నారు. జిల్లాలో 48 వేల మంది ప్రజలు నమోదయ్యారని చెప్పారు. జూన్ 21 నాటికి ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి, సాధన చేసేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. క్యూ ఆర్ కోడ్ వినియోగించి త్వరితగతిన నమోదు కావచ్చన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున నమోదు చేసుకుని ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో యోగ పోటీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో యోగా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే సత్తా ఉన్న వారు అనేక మంది ఉన్నారని, అంతా పోటీలో పాల్గొనాలని ఆయన అన్నారు.

శిక్షకులకు యోగా శిక్షణ

పార్వతీపురం, సాలూరు, పాలకొండ పురపాలక సంఘాలతో సహా గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల ప్రధాన రహదారులపై యోగ కార్యక్రమం నిర్వహించి ప్రజలను సన్నద్ధం చేస్తున్నారు. అలాగే బుధవారం జిల్లాలో మున్సిపాల్టీల పరిధిలో యోగా కార్యక్రమాలు, శిక్షకులకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రా రెడ్డి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కడప జిల్లాలో జరుగుతున్న టిడిపి మహానాడు బహిరంగసభలో మాట్లాడుతున్న జిల్లా చెందిన రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



పాడైపోయిన వాటర్ ట్యాంకు

కిచ్చాడలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో కిచ్చాడలో గత వారం రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామ ప్రజలు ప్రజాశక్తి తో మాట్లాడుతూ ప్రధాన రహదారి వద్ద గల రామమందిరం దగ్గర ఉన్న వాటర్ ట్యాంకు ద్వారా వచ్చే నీటితో 50 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. వారం రోజులుగా మోటర్ పాడైందని అధికారులకు తెలియజేసినా నేటికీ పట్టించుకోవడంలేదన్నారు. కనీసం హ్యాండ్ బోర్ కూడా వీధిలో లేదని, దీంతో సుదూర ప్రాంతం వెళ్లి గంటల కొద్దీ నిరీక్షించి తాగునీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే బోరు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీలోకి బలరాం

ప్రజాశక్తి - సీతానగరం



జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా మండలంలోని బూర్జి గ్రామానికి చెందిన కళ్యాణ బలరాం ఎంపికయ్యారు. దళిత నాయకుడైన బలరాంను ఎస్సి, అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో కమిటీ సభ్యునిగా నియమించినందుకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. బలరాం గతంలో ఉమ్మడి జిల్లా విజయనగరం, శ్రీకాకుళంలో బిసి కార్పొరేషన్ ఇడి పనిచేసి ఉద్యోగ విరమణ చెందారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఒట్టిగెడ్డ వంతెన నుంచి విద్యాశాఖ కార్యాలయం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. వంతెన నుంచి విద్యాశాఖ కార్యాలయం వరకు చీకటి ఉన్నందున సెల్ ఫోన్ లైట్ సహాయంతో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విష సర్పాల ప్రమాదాల బారిన పడక ముందే అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులాల్లో ఇంటర్ సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న ఎపి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ సీట్లు పెంచాలని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందిరికీ సీట్లు కేటాయించి ప్రవేశాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్ కోరారు. ఈ ఏడాది ప్రవేశాలు లేనిచో గిరిజన విద్యార్థులు చదువులకు దూరమవుతారని అన్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించే ఆర్థిక స్థోమత లేక గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్య తలెత్తకుండా ఇంటర్మీడియట్ సీట్లు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేలా ఐటిడిఎ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

మహిళ ఉపాధ్యాయులనే నియమించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయ బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో ఐటిడిఎ పరిధిలో గల అన్ని గిరిజన సంక్షేమ బాలికలు ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియామకాలు చేపట్టాలని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయులను నియమించడం ద్వారా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులనే నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో దినసరి, ఔట్సోర్సింగ్ పద్ధతిలో దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా స్థానచలనం కల్పించాలని కోరారు.

29న కెజిబివి నాన్ టీచింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం టౌన్ : జిల్లాలోని కెజిబివి, ఆదర్శ పాఠశాలల్లో ఆఫ్‌లైన్ ద్వారా నాన్-టీచింగ్ పోస్టులకు ఈ నెల 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. చౌకీదార్ కుక్, డే వాచ్ ఉమెన్ /నైట్ వాచ్ ఉమెన్, స్కావెంజర్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్సు కాపీలతో విజయనగరంలోని కంటోన్మెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రావాలని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థుల జాబితా https://vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని వెల్లడించారు.

పాలమానుగూడలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి - సీతంపేట

మండలం లోని కుడ్డపల్లి పంచాయతీ పాలమానుగూడలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ ట్యాంక్ ప్రారంభించినట్లు కార్యదర్శి వై పాపారావు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ వాటర్ ట్యాంక్ ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సవర మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు ప్రారంభిస్తున్న కార్యదర్శి, సర్పంచి ప్రతినిధి

పనస ధర పతనం

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో పనస ఒకటి. ఈ ఏడాది అధిక దిగుబడి వచ్చినప్పటికీ సరైన మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ఉత్పత్తుల్లో గిరిజనకు ఆర్థికంగా చేయుతనిచ్చేది కూడా పనసే. మండలంలోని కుసిమి, శంభం, కడగండి, మర్రిపాడు, పూతికవలస, దోనుబాయి, పొల్ల పరిసర ప్రాంతాల్లో పనస పంట అధికంగా కాపు వచ్చింది. ఏజెన్సీలో సుమారు 3వేల ఎకరాల వరకు పనస పంట సాగవుతోంది. సేకరించిన కర్జ, బురద రకాల పనసకాయలను బుట్టలో లేదా కావిడిలో మోసుకొని సోమవారం సీతంపేట

ధర లేక గిరిజనులు విలవిల

సంత, శనివారం కూసిమి, శుక్రవారం పూతివలస, బుధవారం మర్రిపాడు సంతలకు గిరిజనులు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారడంతో మార్కెట్ ధర తగ్గించడంతో ఒక్కొక్క కాయ రూ.30, లేదా 40 రూపాయలకే అడుగుతున్నారు. గత ఏడాది ఒక పనసకాయ ధర వంద రూపాయలు వరకు పలికేది. అయితే ఈ పనసకు ఒడిశాలో మంచి గిరాకీ ఉంది. ప్రతి శుభకార్యానికి, హోటళ్లలో పనసకాయ బిర్యానీ, కూర అధికంగా పెడతారు. పనసకాయ బిర్యానీ అంటే ఒడిశావాసీలు చెవి కోసుకుంటారు. గతంలో వ్యాపారులు కిలో చొప్పున కొనుగోలు చేసేవారు ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఏజెన్సీలో పనసకాయలు కారు చౌకగా కొనుగోలు చేసి విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, ఒడిశాలోని భువనేశ్వర్, కటక్, పర్లాకిమిడి వంటి పట్టణాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.



సంతలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న పనసపండ్లు

దిగుబడి వచ్చింది



ఈ ఏడాది పనసకాయలు అధిక దిగుబడి వచ్చినప్పుడు మార్కెట్ ధర లేకపోవడంతో రూ.30కే అడుగుతున్నారు. ఇంటికి తీసుకొని వెళ్లలేక ఎంతోకొంతకు ఇస్తున్నాం.

సవర బంగారయ్య, జెన్నోడు గూడ.

గతేడాది ధర పలికింది



గత ఏడాది ఒక్కొక్క పనసకాయ రూ.70 నుంచి వంద రూపాయల వరకు ధర పలికేది. ఇప్పుడు రూ.30కు అడుగుతున్నారు. దీనివల్ల రవాణా ఛార్జీలకు కూడా రావడం లేదు. కారుచౌకగా విక్రయించాల్సి వస్తోంది.

సవర రవి, రుక్మిణి గూడ.

అటవీ ఉత్పత్తులకు మార్కెట్ ధర కల్పించాలి



గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించి గిరిజనులు ఆదుకోవాలి.

ఎం.తిరుపతిరావు, గిరిజన సంఘం నాయకులు, సీతంపేట

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కురుపాం

యోగాతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుంచి వచ్చే జూన్ 21 వరకు యోగా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు వెలుగు, ఉపాధి హామీ, విద్యా, మండల పరిషత్ సిబ్బందితో కలిసి యోగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరు యోగాను విధిగా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రతిరోజూ యోగా వేయడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. యోగా ఆరోగ్య ప్రధాత అన్నారు. ప్రతి ఒక్కరు యోగా ఆసనాలు వేయాలని కోరారు.

పార్వతీపురంరూరల్ : యోగాంధ్రాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ సుధారాణి అన్నారు. మండలంలోని వెంకంపేట పంచాయితీ వైకెఎం నగర్ కాలనీలో గల డిఆర్‌డిఎ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగేంద్ర మాసం జరుగుతుందన్నారు. సంపూర్ణమైన ఆరోగ్యం కావాలంటే యోగా అనేది మన నిత్యజీవితంలో ఒక భాగంగా ఉండాలన్నారు. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఆరోగ్యం, ఆహ్లాదంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి సత్యంనాయుడు, డిఆర్‌డిఎ డిపిఎంలు, ఎపిఎంలు, విఒఎలు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడిమికెళ్ల గ్రామ సచివాలయంలో యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు పలు రకాల ఆసనాలపై యోగా చేశారు.





పార్వతీపురం, కురుపాంలో యోగాపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



సీతానగరంలో యోగా చేస్తున్న వైద్య సిబ్బంది

బలిజిపేట: యోగా డేను పురస్కరించుకొని బలిజిపేటలో ర్యాలీ నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి సచివాలయంలో యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్, మెడికల్ ఆఫీసర్ క్రాంతి కిరణ్మయి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనీ పిఇటి పరశురాం, ఎంఎల్‌హెచ్‌పిలకు, సచివాలయ, వైద్య సిబ్బందికి యోగాంధ్రా క్లాస్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నగేష్, ఇఒపిఆర్‌డి పుష్పారావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు మండల స్థాయి అధికారులంతా ర్యాలీ నిర్వహించి అనంతరం హైస్కూల్ మైదానంలో యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఆయుర్వేదిక వైద్య అధికారి, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మితో పాటు మండల స్థాయి అధికారులు, సీతానగరం, పెద్ద అంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ లో యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ మిశ్రో ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు గురువులు యోగాసనాలు గురించి వివరించారు. గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం కమలకుమారి, ఎపిఒ సాగర్, వైద్యాధికారులు, సిడిపిఒ రంగలక్ష్మి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

30 వరకు సమైక్యత యాత్ర : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

పహల్గాంలో గతనెల ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 26మంది పర్యాటకులు మృతి చెందడం బాధాకరమని, ఈ దాడిని ఖండిస్తూ ఈనెల 20 నుంచి 30వరకు సమైక్యత యాత్ర చేపడుతున్నట్టు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని గరిల్ల వలస సెంటర్ వద్ద సమైక్యత యాత్రకరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ దేశంలో జాతీయ ఉద్యమ స్ఫూర్తితో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వతంత్ర పోరాటంలో ఎలా పాల్గొన్నారు అదేవిధంగా కుల, మత, జాతి భేదం లేకుండా మన సమాజంలో అన్ని తరగతుల ప్రజలు ఈ ఘాతుకంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారన్నారు. అంతేకాదు ఉగ్రవాద కాల్పుల నుంచి బయటపడిన వారిని కాపాడింది ముస్లిములేనని బాధితులు బహిరంగంగా ప్రకటించారు. కాశ్మీర్ ప్రజలు కూడా ఈ హత్యాకాండను ఖండించారని, అయినా ముస్లిములకు వ్యతిరేకంగా సోషల్ మీడియా విషపూరితమైన ప్రచారం కొనసాగడం దుర్మార్గమని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో దేశ సమైక్యత స్ఫూర్తితో అంతా కలిసి అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన టిడిపి ప్రాథమికంగా లౌకిక పార్టీ అని, అయినా ఎన్డీఏలో భాగస్వామిగా బిజెపి మతోన్మాదానికి వంతపడుతుందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో టిడిపి. వైసిపి, జనసేనలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులు మతోన్మాదానికి, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా మతసామరస్యం, దేశ సమైక్యత భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రజలంతా ఐక్యతతో మతసామరస్యాన్ని కాపాడుతూ దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు అబ్దుల్ ఫరీద్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.తమ్మయ్య, జట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమైక్యతయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

జెవివి జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జన విజ్ఞాన వేదిక పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా వి.దాలినాయుడు, ప్రధానకార్యదర్శిగా డి.చంద్రమౌళి ఎన్నికయ్యారు. ఇటీవల విజయనగరంలో జరిగిన ఉమ్మడి జిల్లా మహాసభలో జిల్లా కమిటీని ఎంపిక చేసినట్లు జెవివి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలక రంజిత్ కుమార్ తదితరులు మంగళవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కొండగొర్రి చిన్నారావు, సహాయ కార్యదర్శిగా ఊర్లక నాగార్జున, మహిళా కార్యదర్శిగా ధనలక్ష్మిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, దేశ స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించి జన చైతన్యానికి కృషి చేయాలన్నారు. సామాన్య ప్రజానీకంలో శాస్త్ర విజ్ఞాన ప్రచారం శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. శాస్త్ర విజ్ఞానం ద్వారా మూఢ విశ్వాసాలను, ఛాందస భావాలను అరికట్టేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మౌలిక స్వరూప స్వభావాలను గూర్చి సమగ్రమైన శాస్త్రీయ అవగాహన పెంపొందించుట పరిష్కారాలను అన్వేషించేలా పనిచేయాలన్నారు. ఏ కొద్దిమందికో పరిమితమైన శాస్త్ర విజ్ఞాన ఫలితాలను సామాన్య ప్రజలకు సైతం అందేలా ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మన్యం జిల్లాలో శాస్త్రీయ ఆలోచనలపై విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సైన్స్ ఫలాలు అందరికీ అందాలన్నారు. కార్యక్రమంలో పలువురు జన చైతన్య వేదిక ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - రామభద్రపురం

వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్ లైబ్రేరియన్ సత్యవాణి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు పుస్తక పఠనం చేయించి తదుపరి విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి వివిధ అంశాలపై పలు ప్రశ్నలు అడిగి క్విజ్ పోటీలు నిర్వహిం చారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఆడలి గ్రామానికి చెందిన నిమ్మక హరీష్ (2) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ చెందినట్లు తెలిసింది దీంతో తండ్రి జనార్దన్‌రావు కన్నీరు పరమతమయ్యారు. యువకుడు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెడ్డివానివలసలో బంగారం చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామవరం పంచాయతీ రెడ్డివానివలసకు చెందిన రెడ్డి ప్రియాంకకు చెందిన రెండు తులాల పుస్తెలతారు చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రెడ్డివానివలసలో రెడ్డి ప్రియాంక తన కన్నవారి ఇంట్లో తండ్రితో పాటు ఇద్దరు పిల్లలతో నిద్రిస్తుండగా సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సుమారు రెండు తులాలు పుస్తెలతాన్ని తీసుకొని వెళ్ళిపోయాడని ఫిర్యాదు చేశారు. ఇంటి వెనుకవైపు నుంచి దొంగ వచ్చి ఈ చోరీకి పాల్పడినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యాన సంఘటనకు సంబంధించి క్లూస్ టీమ్‌లు, సిసిఎస్ నేర స్థలాన్ని పరిశీలించారు.

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని రాజుపేటలో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు కోరెడ్ల బంగారునాయుడు మంగళవారం పొలం దున్నుతుండగా పిడుగు ఉరుములు, మెరుపులు రావడంతో రైతు పరుగులు తీశాడు. ఆ సమయంలో రెండు ఎద్దులు వద్ద పిడుగు పడడంతో ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు సురక్షితంగా బయట పడడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నా, ఎద్దులు మృతితో రైతు, కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్వయం ఉపాధి వైపు మహిళల చూపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మంచి చదువులు చదివిన ఎటువంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరకని ఈ రోజుల్లో స్వయం శక్తితోనైనా పనిచేసి కుటుంబానికి చేదోడుగా నిలవాలని మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక అవసరాల రీత్యా కుటుంబానికి కొంత బాసటగా నిలవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం అందిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమం వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. శిక్షణ అనంతరం స్వయం శక్తితో కుటుంబ పోషణకు అండగా ఉండగలమని భావిస్తున్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్) పట్ల మహిళలు ఎంతగానో ఆసక్తి కనబరుస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్థానిక వైటిసిలో టైలరింగ్ శిక్షణా కేంద్రం ప్రారంభించారు. ఇక్కడ మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి 40మంది మహిళలు ప్రతిరోజూ కుట్టు శిక్షణకు వచ్చి నేర్చుకుంటున్నారు. 90 రోజుల కుట్టు శిక్షణకు ఒక ట్రైనీ తర్ఫీదు ఇస్తున్నారు. స్వయం ఉపాధికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న టైలరింగ్ శిక్షణ స్వయం ఉపాధికి చక్కటి అవకాశం. రోజురోజుకు ఉద్యోగ అవకాశాలు కరువవుతున్న ఈ రోజుల్లో కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

టైలరింగ్ శిక్షణపై ఆసక్తి



టైలరింగ్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు

30న డిఎస్‌సి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 30న నిర్వహించే డిఎస్‌సి మోడల్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ కోరారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎస్‌జిటి అభ్యర్థులకు మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రశ్నపత్రాన్ని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే డిఎస్‌సి పరీక్షకు ఈ నమూనా పరీక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మోడల్ పరీక్ష జరుగుతుందని, విజయనగరంలో గురజాడ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. రూ.50 ప్రవేశ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8019273486, 7095956895 నెంబర్లను సంప్రదించాలని కోరారు. 30న ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 9.30 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.సతీష్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వర్షాలు కురిశాయి. కొన్ని మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. విజయనగరంలో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో సుమారు అరగంటపాటు వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రివరకు చిరుజల్లులు కురిశాయి. రామభద్రపురంలో సుమారు గంటకు పైగా భారీవర్షం పడింది. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొత్తవలస, గజపతినగరం మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. బాడంగి, మెరకముడిదాం, మెంటాడలో మోస్తరు వర్షం కురిసింది. లక్కవరపుకోటలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందాడు.